క్లుప్తంగా

కోడూరి మల్లేశం వర్ధంతి



పరకాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కోడూరి మల్లేశం 4వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకుడు బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సివిల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేపట్టారు. డాక్టర్ బాశెట్టి అభిరామ్, డాక్టర్ బాలకృష్ణ, విద్యాసాగర్, రవికుమార్, జెమిని, సురేష్, బాబురావు, యాకుబ్‌పాషా, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

దామెర : ఎస్‌జీఎఫ్ఐ మండలస్థాయి క్రీడాపోటీలను జయప్రదం చేయాలని ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అండర్ 17 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 28న అండర్ 14 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి, పీఈటీలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

వరంగల్: వరంగల్ ఆరెపల్లిలోని వరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన ఎరువుల గోదాంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడు ఇట్యాల హరికృష్ణ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట, దేశాయిపేట, ఏనుమాముల, మట్వాడ గ్రామాల రైతులు, సంఘం సభ్యులు పాల్గొనాలని కోరారు.

తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు

వరంగల్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామున 5.30 గంటలకే బార్ తెరిచి మద్యం అమ్మకాలు చేపట్టిన బార్ నిర్వాహకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్‌లోని శ్రీరామా బార్ అండ్ రెస్టారెంట్‌లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కౌంటర్‌పై ఉన్న మాచర్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రూ.3,890 విలువ గల మద్యం, రూ.3,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

వరంగల్ అర్బన్: ఇనుప రాడ్లను అపహరిస్తున్న దొంగలను బల్దియా సెక్యూరిటీ గార్డు పట్టుకొని దేహశుద్ధి చేసి మట్టెవాడ పోలీసులకు అప్పగించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయానికి చెందిన మధ్య గేట్‌ను మూసివేసేందుకు సెక్యూరిటీ గార్డు సదానందం చారి అక్కడికి వెళ్లగా మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు పార్కుకు సంబంధించి ఇనుప రాడ్లను తొలగిస్తుండగా, మరో వ్యక్తి వాహనంలో చేరవేస్తున్నాడు. సెక్యూరిటీ గార్డు సదానందం అక్కడి వెళ్లగా ఇద్దరు వ్యక్తులు పరారు కాగా, ఒక వ్యక్తికి అదుపులోకి పట్టుకొని మట్టెవాడ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

రాష్ట్రస్థాయి బృందగీతాల పోటీలకు ఓరుగల్లు విద్యార్థులు

విద్యారణ్యపురి: భారత వికాస పరిషత్ (బీవీపీ) తెలంగాణ ప్రాంత విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈనెల 29న ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జాతీయ బృందగీతాల పోటీలకు ఓరుగల్లు శాఖ నుంచి రెండు గ్రూపుల బృందాల నుంచి 24మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు బీవీపీ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ గురువారం తెలిపారు.

సుమన్‌కు నేషన్ బిల్డర్ అవార్డు

దేశాయిపేట: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు హనుమకొండ రంగంపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గజ్జెల సుమన్.. హనుమకొండ రోటరీ క్లబ్ నేషన్ బిల్డర్ అవార్డును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎస్‌వీఎస్ అధినేత తిరుమల రావు నుంచి అందుకున్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన స్కిల్ స్పార్క్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం రాత్రి జరిగాయి. గజ్జెల సుమన్ చేస్తున్న సామాజిక సేవాకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ

- రజక సంఘం జిల్లా కార్యదర్శి రవీందర్
- జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాల వేసిన పలువురు



కమలాపూర్ : జయంతి వేడుకల్లో నాయకులు



ఆత్మకూరులో..

కమలాపూర్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా కార్యదర్శి కోడెపాక రవీందర్, జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ శ్రీరాంశ్యాం అన్నారు. మండల కేంద్రంలో ఐలమ్మ జయంతిని నిర్వహించి ఆమె చిత్రపటానికి, మర్రిపల్లిగూడెంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. సంఘం డివిజన్ కార్యదర్శి సాంబయ్య, మండల అధ్యక్షుడు విజయ్, నాయకులు సారయ్య, రమేశ్‌గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : చాలకలి ఐలమ్మ జయంతి గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎల్కతుర్తి : తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ 129వ జయంతిని గురువారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటస్వామి, భిక్షపతి, శ్రీనివాస్, రమేష్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్, అనిల్ కుమార్, రాజయ్యగౌడ్, వెంకటరమణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : చాకలి ఐలమ్మ జయంతిని మండల కేంద్రంలో రజక సంఘాల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కో కన్వీనర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

దామెర : చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి మండల రజక సంఘం అధ్యక్షుడు మాదారపు రతన్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం నాయకులు రమేశ్, సాంబయ్య, అశోక్, రఘు, క్రాంతి, మురార్జీ, సుధాకర్, శ్రీకాంత్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా బిట్స్‌లో ప్రిన్సిపాల్ యుగేందర్, ఉపాధ్యాయులతో పాటు తదితరులు ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. శివాజీనగర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల రజక సంఘం అధ్యక్షుడు వాసు, కాంగ్రెస్ నాయకులు రాజు, రమేశ్, రవీందర్‌గౌడ్, పాల్గొన్నారు.



దామెర : జయంతిలో పాల్గొన్న నాయకులు



శాయంపేటలో..



ఎల్కతుర్తిలో..

కొనసాగుతున్న 'నల్‌జల్ మిత్ర' శిక్షణ



అవగాహన కల్పిస్తున్న డీఈ అనిల్

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో చేపట్టిన నల్‌జల్ మిత్ర శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. గ్రామ మంచినీటి సహాయకులకు నల్లాలు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా గురువారం రెండోరోజు శిక్షణ కొనసాగించినట్లు మిషన్ భగీరథ డీఈ అనిల్ తెలిపారు. తాగునీటి సరఫారాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సమస్యలు ఏర్పడితే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సుభాష్‌రెడ్డి, కిరణ్, ఎంపీడీఓ గుండె బాబు, శిక్షకుడు చంద్రశేఖర్, గ్రామమంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

30న ఉచిత వైద్యశిబిరం

కమలాపూర్ : మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఈనెల 30న పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో డాక్టర్ సంధ్యారాణి (ఎండీ, డీజీఓ) స్త్రీల వైద్య నిపుణురాలు సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ వెంకట్‌రెడ్డి (ఆర్ఎంఓ), డాక్టర్ అనిల్‌కుమార్ (కార్డియాలజిస్ట్), డాక్టర్ అశోక్ కుమార్ (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ రణధీర్ (ఆర్థోపెడిక్), డాక్టర్ అభిజాన్ (పాల్మనాలజిస్ట్), డాక్టర్ జన్ను మార్టిన్ (బీడీఎస్), డాక్టర్ పొన్నం శ్రీనివాస్ (ఎండీఎస్), భద్రకాళి డెంటల్ స్పెషలిస్ట్ సిబ్బంది హాజరై ఉచిత రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎంపీడీఓను కలిసిన నాయకులు

శాయంపేట : ఎంపీడీఓ ఫణిచంద్రను బహుజన స్టూడెంట్ యూనియన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం శాలువాతో సత్కరించారు. బీఎస్‌యూ మండల అధ్యక్షుడు భరత్‌చంద్ర, నాయకులు వినయ్, రమేశ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు



ఎల్కతుర్తి : మండల విద్యాధికారిగా చదువుల సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జ్ ఎంఈఓ రామకృష్ణరాజు కమలాపూర్ మండలానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంఈఓ సత్యనారాయణకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శాయంపేట ఎంఈఓగా భిక్షపతి

శాయంపేట : మండల విద్యాశాఖ అధికారిగా భిక్షపతిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా రమాదేవి విధులు నిర్వర్తిస్తుండగా ఆమె స్థానంలో గంగిరేణిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న భిక్షపతిని నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓను ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



నేడు వార్షిక మహాసభ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సహకార సంఘం 68వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు బ్యాంక్ పారాబిల్డ్ రైస్‌మిల్లు ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని, సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ది.విశాల సహకార సంఘం ఆవరణలో శుక్రవారం విశాల సహకార సంఘం 70వ వార్షిక మహాసభ నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో పాల్గొనాలి

దామెర : రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో మండలంలోని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లు పాల్గొనాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర కమిటీ కోసం మొదటిసారిగా రెండు దఫాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం కాజీపేట్ రైల్వే కన్వెన్షన్ హాల్లో, 29వ తేదీన హైదరాబాద్ ఎల్బీనగర్, చింతకుంటలోని జయశ్రీ గార్డెన్స్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

పరకాల : తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కామే లక్ష్యంగా చేపట్టనున్న చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8కోట్ల స్కాలర్ షిప్‌లతో పాటు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని కోరారు. ఎస్‌ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్, పట్టణ కార్యదర్శి సాయితేజ పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు దూదిపాల తిరుపతిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి పరామర్శించారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన వ్యసనం



మృతిచెందిన అశోక్

ఎల్కతుర్తి : మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూరుకు చెందిన గొల్లెన అశోక్ (30) 12 సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన అనూషను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా కొంతకాలంగా అశోక్ మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడేవాడు. మద్యం తాగొద్దు అని భార్య పలుమార్లు చెప్పినా వినిపించుకోకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అశోక్.. ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాగా మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

విషపురుగు కాటుతో వాచ్‌మెన్ మృతి

కమలాపూర్ : నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని విషపురుగు కాటు వేయగా చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన కనకమల్లు (70) రెండు నెలల నుంచి కమలాపూర్ మండలంలోని బచ్చు మాధవరావుకు చెందిన వాయుపుత్ర రైస్ మిల్లులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన రైస్ మిల్లులో రాత్రి సమయంలో గుర్తు తెలియని విషపురుగు కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు కనకమల్లును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆ తర్వాత వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన ఊహ (ఫైల్)

శాయంపేట : న్యూరో సమస్యతో బాధపడుతున్న వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన మేకల ఇంద్ర–పోశయ్య దంపతుల కుమార్తె ఊహను శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి సురేష్‌తో 2017లో వివాహం అయ్యింది. వీరికి ఆరేళ్ల పాప, మూడేళ్ల బాబు ఉన్నారు. అయితే ఊహ కొంతకాలంగా న్యూరో సమస్యతో బాధపడుతుంది. బుధవారం మధ్యాహ్నం శాయంపేటలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పనులు నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన అత్తమామలకు ఊహ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అనారోగ్యంతో మనస్థాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఊహ తల్లి మేకల ఇంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రాజేష్‌కుమార్

దామెర : బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగాధారిత, లింగ సున్నితత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఆలోచనలు, ఆశయాలతో ఎదగాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని రాణించాలని అన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని అధిగమించాలని, లేని పక్షంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుపాలని సూచించారు. సర్వోదయ సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ.. పాఠశాలలో 12 మందితో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ కమిటీ సభ్యులు నిత్యం బాలల సంరక్షణకు పాటుపడతారని అన్నారు. వారికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది కోమల, రవీందర్, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, రవీందర్, సుధాక్షణదేవి ఉమామహేశ్వర్, దేవేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



బోధన తీరును పరిశీలిస్తున్న సారయ్య

శాయంపేట : విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన ఉండాలని పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్య అన్నారు. పెద్దకోడెపాక ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమికోన్నత స్థాయి (యూపీ లెవెల్) తెలుగు ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. శాయంపేట, పరకాల, నడికూడ మండలాల ఉపాధ్యాయులు హాజరు కాగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ, ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు, అభ్యాసన ఫలితాలపై చర్చించారు. విద్యా బోధన, బోధనోపకరణాల ఉపయోగం, చదివే సామర్థ్యం, జ్ఞాపక శక్తి పెంపొందించే ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ వంశీ, ఆర్పీలు రాజు, మాధవి, సుధారాణి, ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హైవే కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి



ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి : మండల కేంద్రం నుంచి సిద్దిపేట వరకు చేపట్టిన హైవే నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మిస్తున్నాడని అతడిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎల్కతుర్తి–సిద్దిపేట హైవే కాంట్రాక్టు పనులు దక్కించుకున్న గుత్తేదారు నాసిరకం కంకర, నాణ్యత లోపంతో కూడిన పనులు చేపడుతున్నాడని ఆరోపించారు. కాంట్రాక్ట్ పనులు దక్కించుకొని నెలలు గడుస్తున్నా సకాలంలో పూర్తిచేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డుపై కంకర తేలి దుమ్ము, ధూళితో వాహనాదారులు, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి, ఎల్లేష్, నాయకులు కరుణాకర్, లింగారెడ్డి, రమాదేవి, వెంకటరమణ, రవి, శంకర్, తిరుపతి, విజయ్, మనోహర్, సదానందం, కుమారస్వామి, సంజీవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో గల మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థి నమిండ్ల అనిక్ జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో నిర్మల్ జిల్లా కేంద్రంలో జిల్లా బేస్‌బాల్ అసోసియోషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనిక్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అక్టోబర్ 2న పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అనిక్‌తో పాటు పీఈటీ రాజు, ఫిజికల్ డైరెక్టర్ రాజును పాఠశాల ఏటీపీ రుక్సానా, డీడబ్ల్యూఆర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

జిల్లాస్థాయికి బిట్స్ విద్యార్థులు

పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ మండలస్థాయి క్రీడల్లో పట్టణంలోని బిట్స్ విద్యార్థులు కబడ్డీ, ఖోఖో అండర్ 14, 17 విభాగంలో ప్రతిభ కనబరిచారు. 11 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బిట్స్ ప్రిన్సిపాల్ పిండి యుగేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

'అండర్‌పాస్' నిర్మించాలని నిరాహార దీక్ష



వల్బాపూర్‌లో దీక్ష చేపట్టిన గ్రామస్తులు

ఎల్కతుర్తి : మండలంలోని వల్బాపూర్ గ్రామంలో అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకిరువైపుల ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించి అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. వల్బాపూర్ నుంచి వీరనారాయణపూర్, దండేపల్లి గ్రామాలకు వెళ్లే వాహనాదారులకు, ప్రయాణికులకు అంతరాయం ఏర్పడనుందని ఆవేదన వెలిబుచ్చారు. పాలకులు వెంటనే స్పందించాలని ఈ సందర్భంగా కోరారు. లేని పక్షంలో గ్రామస్తులను కలుపుకొని ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

దామెర : ఉపాధిహామీ పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి ఉపాధిహామీ పనుల వివరాలు స్వీకరించి మాట్లాడారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా స్టాలిన్

ఎల్కతుర్తి : తెలంగాణ టీచర్స్ క్రికెట్ అసోసియోషన్ (టీటీసీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు స్టాలిన్ ఎంపికయ్యారు. ఈ మేరకు కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఎన్నిక జరిగింది.